నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 15 నవంబర్ 2024 | పేజీలు 8

## సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి

### ఆర్డీవో అనూష



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలక్షన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోటీలో నిలిచిన అభ్యర్థి, ఏకగ్రీవంగా ఎంపికైన అభ్యర్థి ప్రకటన మొదలైన అంశాలకు సంబంధించి సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణారెడ్డి, ఈఈ మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. -మిగతా 2లో

# ఫిట్‌లెస్

- ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలు
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు

**విడవలూరు, మేజర్‌న్యూస్ :**

తమ పిల్లలు ఉన్నత భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి విద్యను అందిస్తున్నారు. కాయకష్టం చేసుకుని మరి తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. కానీ కేవలం ఫీజులు దండుకునే కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పిల్లలు ఏమైపోతే తమకేంటి ! అనే చందాన తమ వైఖరిని కొనసాగిస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు ఉన్న బస్సులు, వాహనాలకు ఫిట్నెస్ లేకుండానే నడుపుతున్నారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం ప్రతి ప్రైవేటు పాఠశాల లేదా కళాశాలకు చెందిన వాహనాలకు ఫిట్నెస్ టెస్ట్ చేసి నడపాల్సిన అవసరం ఉంది. కానీ ఈ నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యం పిల్లల జీవితాలతో చెలగాట మాడుతుంది. ఇందులో భాగంగానే విడవలూరుకు చెందిన అక్షర ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ఆ సమయంలో బస్సులో ఎవరు విద్యార్థులు లేక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.




బుధవారం ప్రమాదానికి గురైన అక్షర ప్రైవేట్ స్కూల్ (ఫైల్)

### డ్రైవర్ నిర్లక్ష్యమా..? ఫిట్‌నెస్ లేదా..?

ఈ ప్రమాదంలో డ్రైవర్ నిర్లక్ష్యమా.. లేక ఆ బస్సుకు ఫిట్నెస్ లేదా.. అనే సందేహం కలుగుతుంది. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలలకు చెందిన యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. గతంలో కూడా బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు గ్రామం వద్ద ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన వాహనం బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. అది మరవక ముందే విడవలూరులో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దారుణం. ఇంత జరుగుతున్నా కూడా సంబంధిత అధికారులు స్పందించకపోవడం కానీ, అలాంటి వాహనాలపై చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిట్నెస్ లేని బస్సులను కొనసాగించకూడదని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఘటనపై గోప్యం..

విడవలూరులో బుధవారం జరిగిన ప్రైవేటు పాఠశాల అక్షర స్కూల్ బస్సు ఘటనపై ఆ పాఠశాల యాజమాన్యం ఘటనను గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నాలు చేపట్టింది. ఇందులో భాగంగానే పలు శాఖ అధికారులతో పాటు మీడియా మిత్రులను కూడా ఈ ఘటన బయటకు రానివ్వకుండా చూడాలని ప్రయత్నాలు చేసినట్టు సమాచారం.


## ఫిట్నెస్ తప్పనిసరి

### డీటీసీ చంద్ర

జిల్లాలోని ప్రతి ప్రైవేటు పాఠశాల, కళాశాలకు చెందిన వాహనాలకు ఫిట్నెస్ తప్పనిసరి. ఫిట్నెస్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం. విడవలూరులో జరిగిన ఘటనపై విచారణ చేపడతామని డీటీసీ చంద్ర **'మేజర్‌న్యూస్'**కు తెలియజేశారు.

## భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**



జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఆయన చాంబర్‌లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ విషయమై రెవిన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎన్‌హెచ్ఏఐ, రైల్వే, ఆర్ఓబీలు, ఆర్అండ్‌బి రోడ్లు, ఏపీ ఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ మొదలైన ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను -మిగతా 2లో

## బాలల దినోత్సవ వేడుకల్లో మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

మన దేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 135వ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతదేశ వ్యాప్తంగా నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవాన్ని వేడుకగా జరుపుకుంటారని మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలియజేశారు. స్థానిక మద్రాస్ బస్టాండ్ కూడలిలోని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దేశానికి ఎక్కువ కాలం ప్రధానమంత్రిగా సేవలందించిన నెహ్రూ తనదైన దార్శనికత, ముందుచూపుతో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని, చిన్నారులను ఆప్యాయంగా పలకరించే వారికి కానుకలు అందజేసి ప్రోత్సహించేవారని తెలిపారు. చిన్న పిల్లలు కూడా పండిట్ నెహ్రూ అంటే గొప్ప అభిమానాన్ని చూపేవారని, అందుకనే చాచా నెహ్రూ అని చిన్నారులంతా పిలిచేవారని మేయర్ తెలియజేశారు. నెహ్రూ లాంటి మహనీయుల ఆదర్శాలను గుర్తు చేసుకుంటూ, ఆచరించడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని మేయర్ ఆకాంక్షించారు.

## బడ్జెట్ బహిరంగ చర్చకు కాకాణి సవాల్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బడ్జెట్‌పై బహిరంగ చర్చకు సీఎం చంద్రబాబుతో సహా మంత్రులకు కాకాణి సవాల్ విసిరారు. గురువారం తన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే అవకాశం లేనే లేదని పేర్కొన్నారు. అందుకు ఈ బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరే నిదర్శనమని చెప్పారు. యనమల రామకృష్ణుడుకి మతిభ్రమించి మాట్లాడారని, 6 లక్షల 46 వేల కోట్లు అప్పు ఉందని మీరు ఇచ్చిన -మిగతా 2లో


# ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి కీలక బాధ్యతలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సోషల్ మీడియాలో వాస్తవాలు తెలియచేసే క్రమంలో ప్రజల కోసం పోరాడుతున్న వైస్సార్సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు పెట్టిన పోస్టులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, వారిని ఇబ్బందులకు గురి చేస్తుండడంతో వారందరికీ అండగా నిలిచేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఇద్దరిని తీసుకున్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని, మరో సభ్యునిగా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నియమించారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి అప్పగించిన బాధ్యతల్లో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు జిల్లాలో ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారికి పార్టీ తరపున పూర్తిగా అండగా నిలబడుతామని తెలియజేశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం దీనికి సంబంధించిన పూర్తి కార్యచరణ రూపొందిస్తామన్నారు.

# బీద రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన కోటంరెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నుడా చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో బీదాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మీ అందరి సహకారంతోనే రెండోసారి నుడా చైర్మన్ పదవి వరించిందని కోటంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోటంరెడ్డిని కూడా బీద ఘనంగా సత్కరించారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో.. నూడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేయాలని, పార్కులలో మౌలిక వసతులు కల్పించాలని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని కోరారు.



## ఉత్కంఠంగా ఇసుక రీచ్‌ల టెండర్లు ప్రక్రియ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఇసుక రీచ్‌ల టెండర్ల ప్రక్రియ ఉత్కంఠంగా సాగింది. జాయింట్ కలెక్టర్ కార్తీక్, మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక రీచ్‌ల కేటాయింపుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ సాగింది. మొత్తం 8 సీల్ టెండర్లు వేయగా.. అప్పారావు పాలెం, పల్లిపాడు ఇసుక రీచ్‌లు సంబంధించి చివరగా ముగ్గురు ఖరారు కాగా, లాటరీ పద్ధతిలో జేసీ కార్తీక్ నిర్ణయించారు. అప్పారావుపాలెంకి సంబంధించి మిలీనియం స్టీల్స్ దక్కించుకోగా పల్లిపాడుకు సంబంధించి భరణి కుమార్ దక్కించుకున్నారు. ఇసుక టెండర్ల ప్రక్రియ అనుక్షణం ఉత్కంఠగా సాగింది.

## ప్రజలు వర్షాల్లో అప్రమత్తంగా ఉండాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు డివిజన్‌లో గత 3 రోజుల నుండి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో బీ.పావని సూచించారు. మంగళవారం నుండి ఆత్మకూరు డివిజన్‌లోని కొన్ని మండలాలలో విస్తారంగా వర్షాలు కురుస్తూ ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాలలోని అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని, అలాగే వర్ష ప్రభావం పరిస్థితిని జిల్లా అధికారులతో కూడా మాట్లాడుతున్నామని ఆర్డీవో తెలిపారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఆర్డీవో తెలిపారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఎటువంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే స్థానిక రెవెన్యూ సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని పావని తెలిపారు.



# టీడీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి కాకాణి



**కావలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధనరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి స్వగృహంలో మాజీ మంత్రి కాకాణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 14 లక్షల కోట్లు అప్పు చేసినట్లుగా చెప్పిన తెలుగుదేశం ప్రభుత్వం.. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 10 లక్షల కోట్లు అప్పు చేసినట్లుగా అదే చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా 6 లక్షల 46 వేల కోట్లు అప్పు అని వాస్తవాలు చెప్పే పరిస్థితిలో తెలిపారు. బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాలకు ఏవిధమైన నిధులు కేటాయించలేదని, ఇక ఆ పథకాలు స్వస్తి చెప్పినట్లేనన్నారు. ఇకపోతే ఉచిత ఇసుక, మట్టి, మద్యం, మొత్తం మాఫియాగా తయారైందని, అనేక రకాలుగా దోపిడీలు చేస్తున్నారని వారు తెలిపారు. సంస్థలు ఏవిధంగా నిర్వీర్యం చేస్తున్నారో.. స్మార్ట్ మీటర్లు రైతుకు బిగించమని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా ! అని ప్రశ్నించారు. చంద్రబాబు నుండి వచ్చే మాటలు పచ్చి అబద్దాలన్నారు. అంతేకాకుండా వైసీపీ నాయకులను, కార్యకర్తలను, సోషల్ మీడియా వారిపై ఏవిధంగా దాడులు చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ సూచనల మేరకు అన్యాయంగా ఆత్మూరు రాజేష్ అనే సోషల్ మీడియా యాక్టివేషన్ వేధించడం, ఇదేవిధంగా బోగోల్లో కూడా జరిగిందని, ఇది సరైన పద్ధతికాదని తెలిపారు. సోషల్ మీడియాకి వైసీపీకి అండగా ఉంటుందని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని, వారందరూ వారి పద్ధతి మార్చుకోవాలని, పథకాలు అని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం వస్తుందన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ఏకష్టం వచ్చినా.. అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

## బడ్జెట్ బహిరంగ చర్చకు కాకాణి సవాల్



(మొదటి పేజీ తరువాయి)

డాక్యుమెంటే ఆధారమన్నారు. 90 శాతం నుంచి 180 శాతం బడ్జెట్ మేము పెంచడానికి ఓ కారణం ఉందని, కోవిడ్ పాండమిక్ సమయమే ప్రధాన కారణమన్నారు. ఓడీ అంటే అర్థం తెలీయకుండా యనమల రామకృష్ణుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ప్రభుత్వంలో క్యాపిటల్ ఔట్ లే.. ఆగిందని పచ్చి అబద్ధాలు చెప్పడం టీడీపీకి అలవాటైపోయిందని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడే మాటలు ఇవేనా.. గతంలో 4.47 వృద్ధి రేటు చంద్రబాబు హయాంలో ఉందని, జగన్ ప్రభుత్వంలో 4.83 శాతం అయిందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 80 వేల 454 కోట్ల పెట్టుబడులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు ఎగ్గొట్టడానికే జగన్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ చంద్రబాబు పాలన కంటే జగన్ ప్రభుత్వంలోనే సమర్ధవంతంగా పని చేసిందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు, యనమల రామకృష్ణుడు మాటలు అర్థం పర్థం లేనివన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిసిపోయాయని, ఇకనైనా అబద్దాలు చెప్పడం మానుకుంటే మంచిదని పేర్కొన్నారు. సమావేశంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆర్డీవో అనూష మాట్లాడుతూ.. నెల్లూరు డివిజన్ పరిధిలోని అధికారులందరూ పూర్తిస్థాయిలో అన్ని అంశాలను అవగాహన చేసుకుని ఎన్నికల సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నిక ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. త్వరలోనే అన్ని మండల కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలకు కూడా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఈ అంకమ్మరావు, డీఈలు, ఏఈలు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి)

వెంటనే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అవార్డు చేసిన భూములకు సంబంధించి పొజిషన్ పూర్తయి, చెల్లింపులు జరగని వారి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కొన్నిచోట్ల ముటేషన్స్ పెండింగ్‌లో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అవార్డు అయ్యాక, చెల్లింపులు చేసిన తర్వాత ముటేషన్స్ కూడా పూర్తి చేస్తేనే ఆయా భూములను సంబంధిత ప్రాజెక్టు వారికి పూర్తిస్థాయిలో అందజేసినట్లు అవుతుందన్నారు. కావున వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పనులు పూర్తిచేసి ఆయా ప్రాజెక్టుల పనులు పురోగతి సాధించేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు రోజువారీ సమీక్షలు తప్పనిసరి అన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులను పట్టాలెక్కిచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, నెల్లూరు, ఆత్మకూరు, కావలి ఆర్డీఓలు నాగ సంతోష్ అనూష, పావని, వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఇరిగేషన్, ఆర్అండ్‌బి ఎస్ఈలు దేశ్ నాయక్, గంగాధర్ సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులు, వివిధ ప్రాజెక్టుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలతో పేదలపై పెనుభారం




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ధరల పేరుదలతో మధ్య తరగతి వారిపై పెను భారం మోపుతుందని రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య పేర్కొ న్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలతో కూడిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్ట జిల్లాల వరప్రసాది అయిన వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్లో అరకొర నిధులు మంజూరు పై మూడు జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీటి కష్టాలు తీర్చే వెలుగొండ ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్లో కేవలం రూ.394 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వెలు గొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు నిలిచిపోగా, సీతారాంసాగర్ ప్రాజెక్టు శిలాఫలకానికే పరిమితవె మైంద న్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు పచ్చడి మెతుకులు కూడా కరువయ్యా యన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించ ఎకోవాలన్నారు. విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలను ప్రభుత్వమే భరించడంతోపాటు ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఎం, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఘాట్ రోడ్డును పూర్తి చేయాలన్నారు. నందవరం రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజలపై భారాలు ఆపాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి గ్రామంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల సీపీఎం కార్యదర్శి రావి మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రజాపోరు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రావి మల్యాద్రి మాట్లాడు తూ.. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్తు బారాలు, నిత్యవసర వస్తువులు ధరలు, విపరీ తంగా పెంచాలని దీనివల్ల సామాన్య ప్రజలు కార్మికులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఓ పక్క ఉపాధి లేకపోవడంతో కుటుం బాలు గడవడం కష్టమవుతున్నాయని అందువల్ల అప్పులు పాలవుతున్నారని ఈ భారాలు సరి కాదని వారి అన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా కొత్త పరిశ్రమ ఒక్కటైనా రాలేదని ఉన్న పరిశ్రమలను మూసివేయటం సరికాదని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకుని మూసి వేస్తున్న పరిశ్రమలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, అర్హులైన పేదవారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయించాలని కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇప్పించాలని రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలని చుక్కల భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండలంలోని ప్రజలందరకు కలుషితం లేని మంచినీరును అందించాలని పై సమస్యలన్నిటిని వెంటనే పరిష్కరించాలని ప్రజా సమస్య.. ప్రజాపోరు రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం నాయకులు ఎం.ఆంటోనీ బాబు, సిపిఐఎం నాయకులు బత్తల నరసింహ, గోసు ప్రసాదు, బి.శ్రీకాంత్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రజా పోరు

# అంగరంగ వైభవంగా బాలల దినోత్సవ వేడుకలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఇస్కపాళెం ప్రాథ మిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను గ్రామస్థులు, తల్లితండ్రులు, పిల్లలు, ఉపాధ్యా యులు సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు హాజరయ్యారు. ఆయనతోపాటు నిడి గుంటపాలెం హైస్కూల్ హెడ్‌మాస్టర్ చలపతి, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ మల్లికార్జున, ఇస్కపాళెం గ్రామ పెద్దలు శ్రీనీతిరెడ్డి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మలాట పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్, కవిత, పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సుధీర్ బాబు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, చక్కగా చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని, తల్లితండ్రులకు, గురువులకు గొప్ప పేరు తేవాలని తెలియ జేశారు. ఎన్‌ఆర్‌ఐ వాసవి అసోసియేషన్ వారు రూ.30వేలు విలువ గల గ్రంథాలయం పుస్త కాలు పాఠశాలకి బహుకరించారు. అలాగే ఆ సంస్థ తరపున జి.మాల్యాద్రి గ్రంథాలయ పుస్తకా లు ఆవిష్కరణ చేశారు. అలాగే నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వారు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థిని గీతిక చేయి ఆపరేషన్ కొరకు రూ.30వేలు నగదును అందజేశారు. గత సంవత్సరం 5వ తరగతి పాసై మొదటిశ్రేణి సాధించిన అలెక్స్‌కి, ద్వితీయ సాధించిన వసుధకి.. గ్రామ పెద్దలు సరిత వారి తండ్రి పెళ్లకూరు సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి.

## ఏబీఎం చర్చిలో పుట్టినరోజుల వేడుకలు



**కావలి, మేజన్‌న్యూస్ :** డాక్టర్ గుండ మడుగుల దేవదానం జన్మదిన సంద ర్భంగా గురువారం ఏబీఎం చర్చిలో వేడుకలను వారి కుమారుడు పీఏబీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ జీడీడీ దివాకర్ ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మా తండ్రిగారైన దేవదానం ఏడు రాష్ట్రాలలో దేవుని సేవ చేసి ఎంతో మందికి ఉచితంగా చదువు చెప్పించారు. అంతేకాకుండా పేదప్రజలను, అనారోగ్య వంతులను అక్కున చేర్చుకొని వారి ఆరోగ్యం కోసం కావాల్సిన సదు పాయాలను, ఆర్థిక సహాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, సైకిల్ తో యాత్ర ప్రారంభించి నా తండ్రి విస్తృతంగా దేవుని సేవ ప్రారంభించి అమెరికా, రష్యా, బూస్టన్, కెనడా అనేక దేశాల్లో సువార్త పరిచర్యను నిర్వహించి, వారు చేసిన దేవుని సేవలను బట్టి ఈరోజు మేము ఇంత ఉన్నత స్థితికి రావడానికి కారణం. తల్లిదండ్రులు చేసిన సేవను గుర్తించి, మాకు ప్రస్తుతం ఈ ఉన్నత స్థితినిదేవుడు ఇచ్చారని కష్టమైనా ఇష్టపడి దేవుని సేవ చేస్తే ఈ విధంగా ఆశీర్వాదాలు ఉంటాయని పీఏబీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ జీడీడీ దివాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వారికి తేనేటి విందును పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నేటి బాలలే.. రేపటి పౌరులు..



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని అమరావతి పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ కె.సురేష్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పిల్లలే ఈ దేశ భవిష్యత్తు అని, పిల్లలు బాగా చదువుకుంటే అద్భుతాలు సృష్టించగలరని కొనియాడారు. నెహ్రూ జయంతి సందర్భంగా పిల్లలకి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డబ్బు కన్నా విద్య విలువైంది..

- కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** డబ్బు కన్నా విద్య చాలా విలువైందని కృష్ణపట్నం పోర్టు సిఈఓ జగదీష్ పటేల్ అన్నారు. గురువారంఅదానీ విద్యా మందిర్‌లో జరిగిన బాలల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడారు. విద్య ప్రతి ఒక్కరినీ శక్తివంతం చేస్తుందనన్నారు. విద్య, కమ్యూనిటీ హెల్త్, సస్టైనబుల్ లైవ్లీహుడ్, డెవలప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ అనే నాలుగు ప్రధాన రంగాలలో స్థానిక కమ్యూనిటీకి సాధికారత కల్పించడానికి అదానీ గ్రూప్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. విద్యార్థులకు సీఎం సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అదానీ విద్యా మందిర్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసరావు, ఎకెపిఎల్ కార్పోరేట్ అఫైర్స్ హెడ్ కె ఎం.రామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకొని, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్ రెడ్డి మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పండిట్ నెహ్రూ భారతదేశ స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు భారతదేశాన్ని పునర్ నిర్మించడంలో ప్రజాస్వా మ్యాన్ని స్థాపించడంలో నెహ్రూ చేసిన కృషిని కొనియాడారు. భారతదేశం ఎల్లప్పుడూ గుర్తుం చుకోవలసిన గొప్ప వ్యక్తి నెహ్రూ అని తెలియ జేశారు. పంచ వర్షప్రణాళిక, భారీ ప్రాజెక్టులు, దేశానికి వెన్నెముక వ్యవసాయ రంగం అలీన విధానం లాంటి విధానాల ద్వారా దేశానికి పునా దులు వేసిన చాచాజీ జన్మదినోత్సవం జరుపు కోవడం కాంగ్రెస్ పార్టీ అదృష్టమని చేవూరు అన్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమం, సంతోషం గురించి సమాజానికి అవగాహన కల్పించారని అన్నారు. బాలల దినోత్సవం నేడు పిల్లల బాల్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సాంకేతిక ప్రపంచం, సామాజిక మాధ్యమాలు, స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌ల దుష్ప్రభావాలలో చాలా మంది పిల్లలు చిక్కుకుపోతున్నారని, పాఠ శాలలు, ప్రవేశ పరీక్షల నుండి కఠినమైన పోటీ, భవిష్యత్తు గురించి ఆందోళనలు వారిని చిన్న నాటి సరళతకు దూరం చేస్తున్నాయి అని అన్నారు. ఈ సమస్యల నుంచి వారిని గట్టెక్కిం చేందుకు మార్గాలు సుగమం చేయాలని, పిల్లల మనసు, ఆలోచనలు, భావాలను మనం గౌరవిం చాలని. పిల్లల బాల్యం వారి జీవితంలో అత్యంత విలువైన వారసత్వం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడత వెంక ట్రావు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధా కర్, మీడియా ఇన్‌చార్జ్ కే.సంజయ్ కుమార్ అడ్వకేట్, అల్లావుద్దీన్, మల్లికార్జునరెడ్డి, హుస్సేన్ బాషా, మోహన్ గణేష్ శ్రీరాములు మల్లి కిషోర్ రెడ్డి, ఫజులుద్దీన్, సేవాదళ్ సుజాత, కిషోర్, ఎన్ఎస్‌యుఐ రాజా, తదితరులు పాల్గొన్నారు.



# నాగార్జున స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌లో సోమవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మీ దుర్గ మాట్లాడుతూ.. భారత దేశ తొలి ప్రధాని చాచా నెహ్రూ అని పేర్కొన్నారు. నెహ్రూకి పిల్లలన్నా, గులాబీ పూలన్నా చాలా ఇష్టమని, పిల్లలను జాతి సంపదలుగా నెహ్రూ చెబుతూ ఉండేవారన్నారు. ఆయన పాలనలో దేశంలో బాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అందుకే ఆయన పుట్టినరోజున మన దేశంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. మన దేశ నిర్మాణంలో జవహర్ లాల్ నెహ్రూ ముద్రలేని రంగం అంటూ ఏదిలేదన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకొని, ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు, అకడమిక్ డీన్ కృష్ణ, డైరక్టర్స్ జీఎన్ రెడ్డి, చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ పాపయ్య, ఏఓ జీవీఆర్ యాదవ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాధమిక విద్యను బలోపేతం చేయాలి





## ఆవిర్భావదినోత్సవం, అధికారులకు విన్నపం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీకేంద్రాల్లో చిన్నారుల పూర్వప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.శివప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టు కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. తల్లీబిడ్డల సంక్షేమం లక్ష్యంగా ఐసిడిఎస్ ఆవిర్భవించి 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం యూనియన్ పిలుపుమేరకు ఆత్మకూరు తహశీల్దారు వి.సుధీర్, ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత తదితరులకు వినతిపత్రాలు సమర్పించారు. ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీకేంద్రాలన్నింటికి పక్కా భవనాలు నిర్మించి మౌళికవసతులు కల్పించాలని, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చేలా ముమ్మర ప్రచారం గావించాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు యూనిఫారమ్, టై, బెల్ట్, షూ ఇవ్వాలని, అమ్మకువందనం అమలు చేయాలని, పిల్లలకు ఇస్తున్న మెనూ క్వాలిటీ పెంచాలని, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, ప్రతినెలా సెంటర్ల అద్దెలు చెల్లించాలన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, రాధలతోపాటు యూనియన్ ప్రతినిధులు హమీదున్నీసా, సుధారాణి, మస్తానమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో ఘనంగా బాలల దినోత్సవ వేడు కలను నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, పెవేటు పాఠశాలలో నిర్వహిం చారు. గురువారం విద్యాశాఖ అధికారి-1 షేక్ మస్తాన్ వలీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి ఉర్దూ గర్ల్స్ పాఠశాలను తనిఖీ చేసి బాలలదినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ 14న మన దేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం జరుపుకుంటామని నెహ్రూకి పిల్లలు అంటే చాలా ఇష్టమని, పిల్లల కోసం ఆయన ఎన్నో పథకాలు రూపొందించాలని, నెహ్రూని అందరూ చాచాజీ అని పిలుస్తారని తెలియజేశారు. తదుపరి విద్యార్థుల పఠన అభ్య సన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నవని, ఆటపాటల ద్వారా విద్యార్థులకు ఆంగ్ల పదాలు, కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు షేక్ కరీంని అభినందించారు. విద్యార్థులచే గ్రంథాలయ పుస్తకాలు చదివించాలని, నిఘంటువులు ఉపయోగించి విద్యార్థులు పదాలను గుర్తించే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. పాఠశాల ఆవరణ పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఠాగూర్ పాఠశాలలో బాలల దినోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని ఠాగూర్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకట రమణారెడ్డి డైరెక్టర్ కె.దొరసామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. తొలి ప్రధాని చాచా నెహ్రూ అని తెలిపారు. బాలల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. చాచా నెహ్రూ పుట్టినరోజున బాలల దినోత్సవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అలాగే మండలంలోని పాఠ శాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నెహ్రూ చిత్రపటానికి ఘన నివాళులు

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మొదటగా మన భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి మంజులత మాట్లాడుతూ.. నెహ్రూ ప్రపంచానికే ఆదర్శమన్నారు. భారతదేశాన్ని విద్యారంగంలో అజేయశక్తిగా నిలపడానికి నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. పిల్లలలో దాగివున్న సృజనాత్మకత, సామర్థ్యాలను వెలికి తీసే ఉపాధ్యాయులంటే నెహ్రూకి చాలా ఇష్టమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మానస సరోవరం అనుకునేరు..

# కాదండి గ్రావెల్ మాఫియా సరోవరం



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం గ్రామనత్వం ఎన్టీఆర్ కాలనీనందు గత ప్రభుత్వంలో నాయకులు చేసినటువంటి రాత్రి పగలు తేడా లేకుండా మాపై దాడులు చేసి ఎర్రమట్టిని దొంగిలించుకుపోయిన గ్రావెల్ మాఫియాని కూకటి వేళ్ళతో పేకలిస్తానని ఎలక్షన్లకు ముందు కొంతమంది నాయకులు మీడియా సాక్షిగా గ్రావెల్ మాఫియా అంతు చూస్తామని చెప్పి తర్వాత పట్టించుకోవడంలేదని గతంలో రామాపురం గిరిజనపిల్లలు గుంటలో పడి చనిపోవడం జరిగిందని రెక్క ఆడితే గాని డొక్కా ఆడని పరిస్థితి మాదని ఉదయం లేచి పనికి పోతే సాయంత్రానికి ఇంటికి వస్తామని ఆటలాడుకుంటూ ఆ గుంటల దగ్గరికి వెళ్తున్నారని ఈ విషయం ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆమె గిరిజనులకు న్యాయం చేస్తామని తెలియజేశారని ఆ గుంటలో వర్షాలు పడి చేరువులు తలపిస్తున్నాయని బుచ్చిరెడ్డిపాలెం వాసులు పోసే చెత్త చెదారంతో నిండి మురికి కుపంగా మారిందని కానీ ఇప్పుడు ఆ గుంటలు పట్టించుకునే నాదుడే కరువయ్యారని ఇప్పుడు ఆ ఊసే లేదని ఎన్టీఆర్ కాలనీరామాపురంప్రజలు వాపోతున్నారు.

ప్రజా సమస్యలపై ప్రజా పోరు..

# తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గండవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేస్తామని చెప్పారు. అంతేగాక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయమని ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ అనేక బహిరంగ సభల్లో వాగ్దానాలు చేశారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పెట్టేందుకు ప్రయత్నించడంతో అవి పగలగొట్టండి కేసులు అయితే మీ వెంట మేము ఉంటామని పగల్బలు పలికారు. కానీ ప్రస్తుతం వాళ్లే స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. వెంటనే ఈ విధానాల్ని ఆపివేయాలని లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున మాట్లాడుతూ.. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్న ఆయన మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు నెలకు 1500 ఆర్థిక సహాయం, చదువుకునే పిల్లలందరికీ తల్లి దీవెన వంటి పథకాలు ఇప్పటివరకు నెరవేర్చలేదని అన్నారు. దశలవారీగా మద్యం నిషేధిస్తానని చెప్పి గత ప్రభుత్వం కన్నా సుమారు 800 షాపులు అదనంగా ప్రైవేటు వారికి అండగట్టారన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నెలకొన్నాయని వాటిని వెంటనే రద్దు చేయించాలన్నారు. కోవూరు వద్ద ఉన్న సహకార చక్కెర కర్మాగారంకి నిధులు మంజూరు చేసి ఉపయోగం లోకి తీసుకు రావాలన్నారు. దీని ద్వారా సుమారు 5000 మందికి ఉపాధి లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, రేకులు గుంట అంకయ్య,విస్సా మునుస్వామి, మద్దిశెట్టి సురేష్, గండవరం మల్లికార్జున, బిల్లా రఘురామయ్య, షేక్ మునీర్ అహ్మద్, షేక్ జానీ బాషా దత్త శ్రీ కోటయ్య పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు యువత ఆధ్వర్యంలో బాలల దినోత్సవం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలను గురువారం పొదలకూరులో ఘనంగా నిర్వహించారు. పొదలకూరు పంచాయితీ పరిధిలోని లింగంపల్లి, లింగంపల్లి తోపు, లింగంపల్లి ఎస్టీ కాలనీ, ఏసి కాలనీ, రామ్‌నగర్ గేట్ సెంటర్, శివాలయం వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో టిడిపి తెలుగు యువత నాయకులు దేగా యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళీరెడ్డి, అనిల్ కుమార్ రెడ్డిలు నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ ప్యాడ్ కిట్లు, విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ, ఒక్కోక్కొరికి ఒక్కొక్క చాక్లెట్ ప్యాకెట్ అందజేశారు. అనంతరం విద్యార్థులతో మమేకమై ఉత్సాహంగా పాల్గొని బాలల దినోత్సవం ప్రత్యేకత గురించి పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మస్తానమ్మ, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంగి రమణయ్య, ఎస్‌కే బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



**నెల్లూరు/స్టోన్‌హౌస్ పేట, మేజర్‌న్యూస్ :** స్టోన్ హౌస్ పేట రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలను ప్రారంభించిన జిల్లా విద్యా శాఖాధికారి బాలాజీ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, జిల్లా సమాచార శాఖ అధికారి బి.సదారావు, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, డిఈవో బాలాజీ, పలువురు ప్రముఖులు. భారత తొలి ప్రధాని దివంగత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## పోలీస్ స్టేషన్‌లో సోషల్ మీడియాపై ఫిర్యాదు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో ఉన్నటువంటి కూటమి నాయకులు అందరూ కలిసి సోషల్ మీడియాలో జరుగుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిపై అలాగే కోడలు నారా బ్రాహ్మినిపై సోషల్ మీడియా అసత్య ప్రచారాలపై సైదాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యంలో కొన్ని నైతిక విలువలు కలిగి ఉన్నాయని, ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఆడపడుచులపై అసత్య ప్రచారాలు తగవని, ఇలా సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ఇకనైనా అసత్య ప్రచారాలపై స్వస్తి పలకాలని కర్ణం శ్రీనివాసులు నాయుడు, దిలీప్ నాయుడు, కేపీ రాజు ఇదితర నాయకులు ఫిర్యాదు చేశారు. వైసిపి సోషల్ మీడియా గానీ టీడీపీ సోషల్ మీడియా గానీ ఎవరైనా సరే ఇలాంటివి అసభ్యకరమైన పదజాలంతో ఎవరైనా మాట్లాడితే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలి



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం మండల రెవెన్యూ ఆఫీసు నందు ప్రజా పోరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోని దయాకర్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ప్రైవేటి కరణ ఆపాలని కృష్ణపట్నం పోర్టు టెర్మినల్ ను పునరుద్ధించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్నటువంటి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని చదువుకున్న విద్యార్థులకు నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని బిగించిన మీటర్లను వెంటనే తీసివేయాలని రాజ్యాంగానికి తూట్లు పొడిచి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే జెమిని ఎన్నికలను వెంటనే విరమింప చేసుకోవాలని జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తిచేసే లబ్ధిదారులు వెంటనే అందించాలని మండల రెవెన్యూ ఆఫీసర్ స్ఫూర్తి రెడ్డికి వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోనీ దయాకర్ వి.దేవానంద్, టి.నరసింహులు ఎస్ సామ్యూల్, డి.చంద్రశేఖర్, కే.హరి, జె.శ్రీహరి నున్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు పరిశ్రమలు అండగా నిలవాలి

**సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పరిశ్రమల యాజమాన్యాలు అండగా నిలుస్తూ సిఎస్ఆర్ నిధులు ఖర్చుపెట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని పంటపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. గురువారం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎఫ్ఎఫ్ఎఫ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఆలపాక అధ్యక్షత వహించారు. ఆయనతోపాటు అధికార పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, శ్యామ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజయ్ కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష పార్టీ నాయకులు చెంగారెడ్డి, ఉప సర్పంచ్ బ్రహ్మానందం, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్లో ఉపాధ్యాయులు బాలల దినోత్సవం జరిపి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫ్యాక్టరీ ప్రతినిధులు శేఖర్ రెడ్డి, సునీల్ బాబు విచ్చేశారు. విద్యార్థినీవిద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థులకు బహుమతులను ఫ్యాక్టరీ యాజమాన్యం సమకూర్చింది. 48 బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూలు ఉపాధ్యాయులు ఫ్యాక్టరీ అధికారులకు సన్మాన కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం ఈ కార్యక్రమం గురించి సర్పంచ్ ఆలపాక మాట్లాడారు. స్కూలుకు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ ఫ్యాక్టరీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూకు చిన్నారులంటే అత్యంత ప్రేమాభిమానం : సీడీపీఓ సునీలత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి ప్రదానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అని, ఆయనకు చిన్నారులంటే అమిత ప్రేమాభిమానాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరులోని ఎస్టీకాలనీ అంగన్‌వాడీకేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త అత్యంతఘనంగా ఏర్పాటుచేసిన బాలలదినోత్సవ కార్యక్రమంలో సిడిపివో సునీలత అతిధిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆయన దేశానికి అశేష సేవలందించారని, ఆయనకు చిన్నారులంటే అమితమైన ఇష్టమని, అందరిని ఆప్యాయతగా దగ్గరకు తీసుకొనేవారని ఆమె పేర్కొన్నారు. నెహ్రూకు చిన్నారులంటే ఇష్టమైనందునే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని సునీలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులచే నెహ్రూ వేషధారణలు గావించగా అందరినీ ఆకట్టుకున్నారు. అందరికీ చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఐఆర్‌సిఎస్ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్ నందు గురువారం నవంబర్ 14, 2024న బాలల దినోత్సవం మన మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నటువంటి చిన్నారులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, అడ్వైజర్ దాసరి రాజేంద్రప్రసాద్ అభినందిస్తూ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పిల్లల పట్ల ఎంతో గొప్ప ఆప్యాయతను చూపించేవారాని, అందుకే పిల్లలంతా ఆయన్ను చాచా నెహ్రూ అని పిలిచేవారాని, బాలలకు ప్రేమను, విలువలతో కూడిన అలవాట్లను, సంరక్షణను, నాణ్యమైన విద్యను ఇవ్వడమే ఈ బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని, నేటి బాలలే రేపటి పౌరులని తెలియజేస్తూ ఈనాటి బాలలను మంచి విద్యార్దులుగా తీర్చిదిద్ది సమాజాభివృద్ధికి తోడ్పడలాని తెలియజేశారు. ఈ బాలల దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలలో పాల్గొన్న స్పాస్టిక్స్ సెంటర్ బాలలకు బహుమతులని, పండ్లను తలస్సెమియా సెంటర్ కొ-కన్వెనర్ ఎస్.కె. పర్వీన్, మెంబర్ ఎస్.అరుణకుమారి, ఫిజియోథెరపిస్ట్ వి.నవీన్ దాతృత్వంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ ఎన్.బలరామయ్య నాయుడు, రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ పి.మస్తానయ్య, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, సంధ్య, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలలదినోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం భారత తొలిప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని అంగన్‌వాడీ కార్యకర్త పి.రాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత ఆదేశాలతో సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి రాధ పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ చిన్నారులచే నెహ్రూ వేషధారణలు గావించి ఆకర్శణీయంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ.. జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశ తొలి ప్రధానమంత్రి అని, దేశ ప్రజలకు ఎన్నో సేవలందించారని, ఆయనకు చిన్నారులంటే అమిత ఇష్టమని, అందుకే ఆయన జయంతిని బాలలదినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం అందరికీ చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులు, ఈప్రాంత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చాచానెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపివో పిసునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవ నారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మల ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు కార్యక్రమాలను నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు నెహ్రూ వేషధారణ గావించారు. ఆటపాటలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా కేంద్రాల చిన్నారులు, ఆయా ప్రాంతాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణపై ప్రభుత్వాలు విఫలం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** నిత్యవసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బోగోలు సిపిఎం పార్టీ కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నవంబర్ 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు తలపెట్టిన ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల తహసిల్దార్ కార్యక్రమనికి వెళ్లి మండల తహసిల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల వెంకయ్య మాట్లాడుతూ.. విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని, పెరిగిన నిత్యవసర వస్తువులను అదుపు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీలు ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఉచిత ఇసుకను తక్షణమే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, బిట్రగుంటను రైల్వే పరంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, బోగోలు మండల వ్యవసాయ శాఖ సభ్యులు పోతల రమేష్, సిఐటియు సభ్యులు బాదుల్లా, దమ్ము శంకరయ్య, యానాదయ్య, యువజన సంఘం నాయకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజేత స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రామమందిరం వీధిలోని శ్రీ విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగవరపు కామాక్షి మాట్లాడుతూ.. నెహ్రు జన్మదినం రోజున ఈఉత్సవం జరుగుతుందని నెహ్రుకు పిల్లలతో వున్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవ వేడుకలు జరుపుకుంటారని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈరోజున తపాల బిళ్ళను విడుదల చేస్తుందని ఆమె తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిలో పోరాటం చేసేటప్పుడు మహాత్మాగాంధీ ప్రథమ శిష్యుడిగా ఉండేవాడని కామాక్షి తెలిపారు. దేశంలోని బిడ్డలందరని ప్రేమించే స్వభావం చాచా నెహ్రుదని పిల్లలతో వున్నప్పుడు మనసు హాయిగా వుంటుందని ఏ పవిత్ర స్థలంలో కూడా ఇంతటి శాంతి, సంతృప్తి లభించవని నెహ్రూ అనేవారని ఆమె తెలిపారు. బాలల దినోత్సవ రోజున విద్యార్థులందరికీ నెహ్రు యొక్క విశిష్టతను తెలియజేస్తూ ప్రతి ఒక్క విద్యార్థికి కరస్పాండెంట్ కామాక్షి గిఫ్ట్‌లను అందించారు. ప్రత్యేకంగా ఐఐటి విద్యార్థులకు ప్రత్యేకంగా మెమోంటోష్‌ని అందజేశారు.



# గ్రంధాలయాలు విజ్ఞానబాండాగారాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గ్రంథాలయాలు సమాజంలో అన్ని వర్గాలకు విజ్ఞాన బాంఢాగారాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆత్మకూరులోని శాఖా గ్రంధాలయంలో గురువారం లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను పలువురు అతిధులు హాజరై ప్రారంభించారు. తొలుత సరత్వతీదేవి చిత్రపటానికి పూలమాలవేసిన అనంతరం చాచానెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలోని అన్ని వర్గాలవారికి అవసరమైన అన్నీ రకాల గ్రంధాలున్నాయని, అందరూ వినియోగించుకుంటే విజ్ఞానం, కాలక్షేపం, పురాతన చరిత్రలపట్ల అవగాహన తదితరాలు పొంపొందుతాయన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు వెలిశెట్టి నారాయణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటినుండే గ్రంధాలయ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిద రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంధాలయవారోత్సవాల ముగింపుసభలో బహుమతులు అందజేస్తామని శ్రీనివాసరాజు పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంధపాలకులు ఏ.గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.గంగాధరం, నాణెముల సేకరణకర్త ఎండి వాయిజ్, రిటైర్డ్ లైన్‌మెన్ ఎం.కోటేశ్వరరావు, పూనూరు రమేష్‌రెడ్డి, లైబ్రరి రికార్డ్ అసిస్టెంట్ ఎల్.తనూజ, పలువురు పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించండి

**- రాష్ట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు**




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా యువతకు ఉపాధి కల్పించడంలో వెనుకబడిందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు ఆరోపించారు. స్థానిక ఇందిరా భవన్‌లో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి మమతా నారపరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా నారపరెడ్డి మాట్లాడుతూ.. యువ మహిళలకు రాజకీయ శిక్షణ శిబిరాలు, మహిళా సమస్యలు పరిష్కరించుకోవడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలా యువతకి ఉద్యోగాల కల్పనలో ఎలాంటి ప్రణాళిక లేదని, సంవత్సరానికి 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, లోకేష్‌బాబు ఉద్యోగుల ప్రస్తావనే లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గంజాయి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా యవత చేతికి అందుతున్నాయని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా విచ్చలవిడిగా మద్యం షాపులు బెల్ట్ షాపులకు పర్మిషన్లు ఇచ్చి మద్యం ఏరులై పారేలా చేస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చేవూర్ దేవ్ కుమార్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి గణేష్, నాగిరెడ్డి రాజేష్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో గిరిజన గర్భిణీలకు, పిల్లలకు అందని పౌష్టికాహారం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి పంచాయతీలోని నెహ్రూ నగర్ అంగన్వాడి కేంద్రంలో గర్భిణి, గిరిజన పిల్లలకు పౌష్టికాహారం సరిగా అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్న వాటిని పక్కదారి పట్టిస్తున్నారని గర్భిణీలు పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలదంకి పంచాయతీలోని నెహ్రూ నగర్ అంగన్వాడి కేంద్రంలో మాత్రం గిరిజన బిడ్డలకు పౌష్టికాహారం సరిగా అందడం లేదు. అంగన్వాడీ కేంద్రానికి రావాల్సిన సరుకులు కూడా ఒకటి వస్తే మరొకటి రావటం లేదని ప్రస్తుతం అయితే రెండు నెలలుగా సరుకులు రావడం లేదని పసిబిడ్డలు ఆకలితో అలమటిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల ఏదో ఒకటి కరువవుతూనే ఉందని దీంతో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారన్నారు. తమ పిల్లలకు విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తారని ఉద్దేశంతో తమ బిడ్డలను అంగనవాడి కేంద్రాలకు పంపిస్తుంటే పౌష్టికాహారం తో పాటు, విద్యకు కూడా దూరమవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులమైన మాకు చదువు లేకపోయినా తమ బిడ్డలు ను చదివించుకునే ఉద్దేశంతో ఉన్నామని కానీ అంగన్వాడి కేంద్రాలు మా ఆశలను నీరు కారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంగన్వాడీ వర్కర్ సెలవులో ఉండగా వేరే సెంటర్ నుండి మరొకరిని నియమించాల్సి ఉంది. అయితే కనీసం ఈ విషయంపై కూడా సంబంధిత అధికారులు రెండు నెలలుగా దృష్టి సారించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలదంకి మండలం అంతా కూడా అంగన్వాడీ కేంద్రాల పనితీరు అస్తవ్యస్తంగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా



అంగన్వాడి కేంద్రాలకు నెలవారీగా చేరాల్సిన పౌష్టికాహార సరుకులు నేరుగా చేరటం లేదని మధ్యలో ఒక సెంటర్లో దింపితే అక్కడ నుంచి ద్విచక్ర వాహనాలపై మిగతా సెంటర్లోకి తీసుకుపోవాల్సి వస్తుందని సమయానికి, గర్భిణీలకు చిన్నారులకు ఆహారాన్ని అందించలేకపోతున్నామని అంగన్వాడీ వర్కర్లు వాపోతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నెహ్రు నగర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో వర్కర్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారాన్ని ప్రతిరోజు అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

**సీడీపీఓ పద్మజ వివరణ :** ఈ సమస్యల ఇప్పటివరకు మా దృష్టికి రాలేదని, అంగన్వాడి వర్కర్ సెలవులో ఉందని, ఆయా మాకు తెలియజేయలేదని సీడీపీఓ పద్మజా కుమారి తెలిపారు.



# జలదంకిలో మెయిన్ రోడ్ అద్వానం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకిలో మెయిన్ రోడ్ గుంతల మయంగా ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జలదంకిలోని గ్రోమోర్ ఎరువుల అంగడి ఎదుట గుంతల ఏర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడితే, రాత్రి సమయంలో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారని వాహనదారులు తెలిపారు. ఈ రోడ్డుతో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారని, ఆర్ అండ్ బి అధికారులు, పాలకవర్గం, గమనించి గుంతల మయంగా ఉన్న మెయిన్ రోడ్డును మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరారు.

# విద్యార్థులు జ్ఞాన సంపదను పెంచుకోవాలి

**● సామాజికవేత్త మాలకొండ రెడ్డి**



**కావలి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు యువత పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదను పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెంగల రావునగర్ ప్రభుత్వ శాఖ గ్రంధాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి మాలకొండ రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాల విశిష్టతపై ప్రజలు పౌర సంస్థలు అవగాహన పెంచుకొని గ్రంథాలయాలను వినియోగించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత పోటీ పరీక్షలకు, దేశభక్తిని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలును వినియోగించుకోవాలని కోరినారు. స్వాతంత్ర ఉద్యమ కాలం నుండి ప్రజలను చైతన్య పురుస్తూ సామాజిక బాధ్యతను పెంపొందించివారని తెలిపారు. 14వ తేదీ గురువారం మాజీ ప్రధాని కీర్తిశేషులు జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. నెహ్రూ జయంతి రోజున బాలల దినోత్సవం కూడా జరుపుకోవటం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ శాఖ గ్రంథాలయం అధికారి సునీత అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పిజి సెంటర్ ఉపాధ్యాయురాలు మంజుల, సచివాలయం ఉద్యోగి సురేష్, చదువరులు పాఠకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



**నెల్లూరు బార్కస్, మేజర్‌న్యూస్ :** ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ నెల్లూరు జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, జిల్లా కార్మికుల అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ ఆధ్వర్యంలో వెంకటాచలం మండలం, కసుమూరు గ్రామంలో మస్తాన్ మదరసా నందు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ ఆల్ ఇండియా చీఫ్ జనరల్ సెక్రటరీ కె.అబ్దుల్ రెహమాన్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు విస్తారంగా కురుస్తున్న కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున పేద ప్రజలకు అనుభవంగాల డాక్టర్ చే ఉచితంగా పరీక్ష చేయించి మందులు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. ఈ ఉచిత మెడికల్ క్యాంపు నందు దాదాపు 300 మందిని పరీక్షించి వారికి కావలసిన మందులను అందించడం జరిగిందన్నారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులనుండి రక్షణ పొందవచ్చని అన్నారు. తమ సంస్థ ద్వారా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏక యాంటీ కరప్షన్ సంస్థ జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ చోటే బాబు, సభ్యులు కసుమూరు భాష, సయ్యద్ షబ్బీర్, సయ్యద్ షఫీ, సయ్యద్ భాష, షేక్ నజీర్ భాష, సయ్యద్ మౌలానా, షేక్ సర్దార్, షేక్ మస్తాన్, డాక్టర్ షేక్ ఫరుఖ్ అలీ, జమీర్ అహ్మద్, రబ్బాని, జి.శ్రీనివాసులు, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

